
# ఇంట్లో ఎంత బంగారం?

## ఐటీ శాఖ పరిమితులు ఏం చెప్తున్నాయ్



న్యూఢిల్లీ, మే 16: మన ఇండ్లలో ఎంతో కొంత బంగారం ఉంటుంది. అయితే ఎంత ఉంచుకోవాలన్నదానికీ కొన్ని పరిమితులున్నాయని మీకు తెలుసా? ఆదాయ పన్ను (ఐటీ) శాఖ నిబంధనలు ఏం చెప్తున్నాయి?

**ఇదీ సంగతి**

భారత్‌లో బంగారం.. ఓ ఆభరణం, పెట్టుబడి సాధనం మాత్రమే కాదు అంతకు మించిన గౌరవం. చాలామంది దీన్ని దైవంగా కూడా కొలుస్తారు. లక్ష్మీదేవి అవతారం అంటూ ఇనప్పెట్టెల్లో దాచేస్తారు. అయితే మన దగ్గరుందికదా అని ఎంతంటే అంత ఇండ్లల్లో పెట్టుకోవడం కుదరదంటోంది ఐటీ శాఖ. నిజానికి ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి పరిమితుల్నీ విధించలేదు. కానీ ఐటీ శాఖ అధికారులు జరుపుతున్న సోదాల్లో పట్టుబడుతున్న పుత్తడిపై ఆదాయ పన్ను చెల్లింపుదారులకు, ఆదాయ పన్ను శాఖకు మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. చివరకు మహిళలు ధరించిన నగల్నీ అధికారులు తీసేసుకుంటున్నారన్న ఆరోపణలుంటున్నాయి. దీంతో మన దగ్గర చట్టప్రకారం ఎంత ఉండాలి? అన్న ప్రశ్నలు ఇటీవలికాలంలో తరచూ అందరిలో తలెత్తుతున్నాయి. అయితే 1994లో ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం పరిమితికి లోబడి ఉన్న బంగారం జోలికి ఐటీ సోదాల్లో ఏ అధికారీ వెళ్లకూడదు.

**ఇదీ పరిమితి..**

పెండ్లైన మహిళకు 500 గ్రాముల (అరకిలో లేదా 50 తులాలు) వరకు బంగారం ఉండొచ్చు. పెండ్లికాని మహిళలకు మాత్రం 250 గ్రాముల (పావుకిలో లేదా 25 తులాలు)కు మించి బంగారం ఇంట్లో ఉండరాదు. ఇక మగవారికి ఈ పరిమితి 100 గ్రాములే (10 తులాలు). ఐటీ సోదాల్లో ఈ మేరకు ఆయా వ్యక్తులకు సంబంధించిన పసిడి దొరికితే అధికారులు వదిలేయాలి. ఈ పుత్తడికి ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోయినా దాని జోలికి పోరాదు. కాగా, ఈ పరిమితులు కేవలం ఆభరణాల రూపంలో ఉన్న బంగారానికే వర్తిస్తాయి. బిస్కట్లు, కడ్డీల రూపంలో ఉన్న బంగారానికి సంబంధించి ఈ సర్క్యులర్‌లో సీబీడీటీ ఏ సూచనలూ చేయలేదు.

**వారసత్వ నగలపై..**

ఒకవేళ ఎవరికైనా తమ తాత, ముత్తాతల నుంచి వంశపారంపర్యంగా, వారసత్వ సంపదగా పెద్ద ఎత్తున బంగారు అభరణాలు వస్తే దానికి సంబంధించి ఓ చిన్న నిబంధన ఉన్నది. అప్పుడు అందుకు సంబంధించిన రుజువులు చూపాల్సి ఉంటుంది. సదరు సాక్ష్యాలు సరైనవేనని తేలితే ఆ నగలను ఐటీ అధికారులు సీజ్ చేయరు. లేకుంటే జప్తు చేస్తారు. అయినప్పటికీ ఆ తర్వాత కూడా వాటికి సంబంధించిన సాక్ష్యాధారాలను చూపి వాటిని విడిపించుకోవచ్చు. ఇదిలావుంటే పట్టుబడిన బంగారం పరిమితులకు లోబడి ఉన్నా.. దర్యాప్తు సమయంలో అధికారులు వాటి ధ్రువపత్రాలను చూపాలని కోరుతున్నట్టు పలువురు ట్యాక్స్‌పేయర్స్ చెప్తున్నారు. అయితే ఇలాంటప్పుడు నిపుణుల సాయంతో రూల్స్ ప్రకారం వెళ్లి మీ బంగారాన్ని మీరు తీసుకోవడానికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మరువద్దు.



## వెండి హైజంప్

### రూ.1,800 పెరిగిన కిలో ధర

న్యూఢిల్లీ, మే 16:వెండి ధరలు రికార్డు స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీలో గురువారం ఒకేరోజు కిలో వెండి ఏకంగా రూ.1,800 అధికమై రికార్డు స్థాయి రూ.88 వేలు దాటింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి రూ.88,700 పలికింది. అంతకు ముందు ఇది రూ.86,900గా ఉన్నది. ఇటు హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1,500 ఎగబాకి రూ.89,100 పలికింది. వెండితోపాటు బంగారం ధరలు భారీగా పుంజుకున్నాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం పుత్తడి ధర రూ.650 అందుకొని రూ.74,050కి చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల తులం పుత్తడి ధర రూ.770 అధికమై రూ.74,020కి చేరుకోగా, 22 క్యారెట్ల ధర కూడా రూ.700 అధికమై రూ.67,850కి చేరింది.

## 42 కోట్లకు విమాన ప్రయాణికులు

న్యూఢిల్లీ, మే 16: దేశవ్యాప్తంగా విమానాల్లో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి దేశీయంగా విమానాల్లో ప్రయాణించేవారి సంఖ్య 40-42 కోట్లకు చేరుకునే అవకాశం ఉన్నదని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. కరోనా కంటే ముందుస్థాయికి విమాన ప్రయాణికులు చేరుకున్నారని, గతేడాది మార్చి నాటికి వీరి సంఖ్య 37.64 కోట్లకు చేరుకున్నట్లు తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 8-11 శాతం సరాసరి వృద్ధితో వచ్చే మార్చి నాటికి ఈ సంఖ్య 40.7 కోట్ల నుంచి 41.8 కోట్ల మధ్యలో నమోదుకానున్నట్లు పేర్కొంది. ఢిల్లీ, హైదరాబాద్, కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయాలతోపాటు ఎయిర్‌పోర్ట్స్ అథార్టీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది ఇక్రా. అంతర్జాతీయ విమాన ప్రయాణికుల్లో భారత్ వాటా 4.2 శాతానికి పెరిగింది.

## 37 వేల కోట్ల పెట్టుబడులు..23 వాహనాలు

### వచ్చే మూడేండ్లలో మహీంద్రా భారీ ప్రణాళిక

న్యూఢిల్లీ, మే 16: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా భారీ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. వచ్చే మూడేండ్లకాలంలో రూ.37 వేల కోట్ల పెట్టుబడితోపాటు దేశీయ మార్కెట్లోకి 23 నూతన వాహనాలను విడుదల చేయబోతున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో అనిశ్ షా తెలిపారు. విడుదల చేయనున్న వాహనాల్లో తొమ్మిది ఇంటర్నల్ కంబ్యుస్టాన్ ఇంజిన్(ఐసీఈ) ఎస్‌యూవీ, ఏడు బ్యాటరీతో నడిచే వాహనాలు, ఏడు లైట్ కమర్షియల్ వాహనాలను 2030 నాటికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. తొమ్మిది ఐసీఈ ఎస్‌యూవీల్లో నూతన బ్రాండ్‌తో ఆరు మాడళ్లు కాగా, మూడు పాత బ్రాండ్లను మళ్లీ ప్రవేశపెట్టబోతున్నది. ఈ తాజా పెట్టుబడుల్లో ఆటో డివిజన్ కోసం రూ.27 వేల కోట్లు, ఐసీఈ వర్టికల్ కోసం రూ.14 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నది. ఈ నిధులతోనే దేశవ్యాప్తంగా ఉన్న ప్లాంట్ల సామర్థ్యాన్ని పెంచుకోనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం సంస్థ వద్ద 2.2 లక్షల వాహనాల పెండింగ్ ఆర్డర్లు ఉన్నాయని, వీటి కోసం ప్లాంట్ల సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు ఆయన చెప్పారు.



## సామ్‌సంగ్ నయా పవర్ బ్యాంక్స్

### ప్రారంభ ధర రూ.3,499

న్యూఢిల్లీ, మే 16: దేశీయ మార్కెట్‌లోకి ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ రెండు సరికొత్త అధిక సామర్థ్యం కలిగిన పవర్ బ్యాంక్స్‌ను విడుదల చేసింది. 45వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్‌తో 20,000 మెగాహెట్జ్ శ్రేణిలో ఒకటి, 25వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్‌తో 10,000 మెగాహెట్జ్ శ్రేణిలో మరొకదాన్ని పరిచయం చేసింది. ఇందులో 20,000 మెగాహెట్జ్ బ్యాటరీ పవర్ బ్యాంక్ ధర రూ.4,299. 10,000 మెగాహెట్జ్ బ్యాటరీ పవర్ బ్యాంక్ ధర రూ.3,499. స్మార్ట్‌ఫోన్లేగాక హెడ్‌ఫోన్స్, గేమింగ్ కన్సోల్స్, కెమెరాలు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు, వైర్‌లెస్ ఇయర్ బడ్స్ వంటి వాటిని చార్జ్ చేసుకోవచ్చు.

## హైదరాబాద్‌లో మరో దీసావాలా యూనిట్

### రూ.40 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ

హైదరాబాద్, మే 16: ప్రీమియం రబ్బరు ఉత్పత్తుల తయారీ సంస్థ దీసావాలా.. హైదరాబాద్‌లో నాలుగో యూనిట్‌ను తెరిచింది. ఇప్పటికే బాల్‌నగర్‌లో మూడు ప్లాంట్లు ఉండగా, తాజాగా మేడ్చల్‌కు సమీపంలోని కాళ్లకల్ వద్ద 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు ప్లాంట్‌ను ఆరంభించింది. వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా ఈ నాలుగో ప్లాంట్‌ను రూ.40 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసినట్లు, తద్వారా 200 నుంచి 300 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని దీసావాలా రబ్బర్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముర్తాజ దీసావాలా తెలిపారు. దీంతో ప్రస్తుతం రోజుకు 7-8 టన్నుల రబ్బర్ ఉత్పత్తి అవుతుండగా, ఈ ప్లాంట్ అందుబాటులోకి రావడంతో కెపాసిటీ మూడింతలు పెరిగి 25 టన్నులకు చేరుకున్నదని చెప్పారు. నాణ్యమైన రబ్బర్‌కు పెరుగుతున్న డిమాండ్‌తో ఈ యూనిట్ పక్కనే మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ఇందుకోసం రూ.40 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిన సంస్థ..2025-26 నాటికి రూ.300 కోట్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## నరేష్ గోయల్ భార్య మృతి

ముంబై, మే 16: జెట్ ఎయిర్‌వేస్ ఫౌండర్ నరేశ్ గోయల్ భార్య అనిత గోయల్ మరణించారు. ఆమె వయస్సు 70 ఏండ్లు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె.. ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. బ్యాంకుల వద్ద రుణం తీసుకొని ఎగ్గొట్టిన కేసులో గోయల్‌కు ఇటీవల మధ్యంతర బెయిల్ మంజూరుచేసింది.

## 500 బిలియన్ డాలర్లకు ఎగుమతులు!

న్యూఢిల్లీ, మే 16: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ ఎగుమతులు 60-70 బిలియన్ డాలర్లు పెరిగి 500 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉన్నదని ఎఫ్‌ఐఈవో వెల్లడించింది. గతేడాది ఎగుమతులు 3 శాతం తగ్గి 437 బిలియన్ డాలర్లకు పరిమితమైన విషయం తెలిసిందే.

# మార్కెట్‌లో ఎందుకీ ఆటుపోట్లు

*వచ్చే రెండు నెలలూ తీవ్ర ఒడిదొడుకుల్లోనే ట్రేడింగ్ • మెజారిటీ నిపుణులు ఏమంటున్నారు?*

న్యూఢిల్లీ, మే 16: లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గత నెల రోజుల నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. ఈసారి బీజేపీకి ఆశించిన స్థాయిలో మెజారిటీ రాబోదన్న అంచనాలే ఇందుకు కారణమని ఎక్కువ మంది నిపుణులు పేర్కొంటున్నారు. 2019తో పోల్చితే సీట్లు తగ్గుతాయంటున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి దీనికి బలమైన కౌంటర్ లేకపోవడం ఈ అంచనాలకు మద్దతునిస్తున్నదిప్పుడు. ఈ క్రమంలోనే మదుపరులు భయాందోళనలకు గురై.. పెట్టుబడులపై ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారని, అది ఒడిదొడుకులకు దారి తీస్తున్నదని స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్ సరళిని అంతా విశ్లేషిస్తున్నారు. అంతేగాక వచ్చే రెండు నెలలూ మార్కెట్లలో ఆటుపోట్లు తప్పవంటున్నారు. కొత్త ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్ ప్రభావం కూడా స్టాక్ మార్కెట్లపై ఉంటుందంటున్నారు.



**మార్పును కోరుతున్నారు..**

దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా జరిగిన పోలింగ్‌పై విశ్లేషకుల నుంచి రకరకాల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఓటింగ్ శాతం తగ్గడాన్ని వివిధ రకాలుగా అభివర్ణిస్తున్నారు. ఈ పరిణామం ఎన్నికల ఫలితాలను ఎటువైపైనా తిప్పగలదని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ బెర్న్‌స్టెయిన్ అంటున్నది. పదేండ్లు అధికారంలో ఉన్నందున ప్రజలు మార్పును కోరుకుంటున్నారని కూడా చెప్తున్నది. 2019లో పుల్వామా ఉగ్రదాడికి ప్రతిగా చేసిన బాలకోట్‌పై విమాన దాడి కలిసొచ్చిందంటున్న బెర్న్‌స్టెయిన్.. 2014 కంటే తక్కువ స్థాయిలోనే ఈసారి సీట్లు వస్తాయని విశ్లేషిస్తున్నది. ఇంకోవైపు మోజోపీఎంఎస్‌లో చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సునీల్ దమానియా పడిపోయిన ఓటింగ్ శాతం.. ప్రస్తుత ప్రభుత్వానికి అనుకూలం కాగలదంటున్నారు. ఇదిలావుంటే ఈ నెల మొదలు ఇప్పటిదాకా నిఫ్టీ దాదాపు 2 శాతం పడిపోయింది. నిజానికి ఈ నెల 3న సూచీ ఆల్ టైమ్ హై (22,794.70)ని తాకింది. అయినప్పటికీ స్థిరత్వ లోపం కారణంగా వచ్చిన నష్టాలతో పతనాన్ని చవిచూడాల్సి వచ్చింది. మరోవైపు విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) తమ పెట్టుబడులను అదేపనిగా వెనక్కి తీసుకుంటుండటం, అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం కూడా మార్కెట్ల ఒడిదొడుకులకు కారణమవుతున్నాయని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు. ఈ పరిణామాలన్నింటికి ఇండియా వీఐఎక్స్ (అస్థిరత సూచీ) అద్దం పడుతున్నదని గుర్తుచేస్తున్నారు.

**ఊగిసలాట మధ్య లాభాలే..**

తీవ్ర ఒడిదొడుకుల మధ్య గురువారం దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 676.69 పాయింట్లు లేదా 0.93 శాతం పెరిగి 73,663.72 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 73,749.47 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఇంకోసారి 72,529.97 పాయింట్ల కనిష్ఠాన్ని చేరింది. ఫలితంగా మదుపరులు లాభనష్టాల నడుమ ఊగిసలాడారు. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 203.30 పాయింట్లు లేదా 0.92 శాతం అందుకుని 22,403.85 వద్ద నిలిచింది. బుధవారం కూడా తీవ్ర ఒడిదొడుకుల నడుమ మార్కెట్లు నష్టపోయిన విషయం తెలిసిందే.